# ఆమె కోరుకునేది...

స్వాతి వీక్లీ




**కా**లేజి బయట ఏరియాలో కూర్చుని 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్' టెక్స్ట్‌బుక్ తిరగేస్తూన్న గోకుల్‌లో ఒకింత టెన్షన్ కదలాడుతోంది. ఒకవైపు ఎగ్జామినేషన్ ఫియర్, మరోవైపు సాలిడ్ ప్రిపరేషన్ లేకపోవడంతో ఆత్రుతగా చాప్టర్స్ తిరగేస్తున్నాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ! ఎమ్.కె.యూనివర్సిటీ ఎమ్.బి.ఎ. ఎగ్జామినేషన్ సెంటర్ ఇదేనా?" తేనెలూరే పలుకులతో తీయనిగొంతు వినిపించేసరికి తల పైకెత్తాడు.

స్నఫ్ కలర్ పంజాబీ డ్రెస్ మ్యాచింగ్ చుడీదార్‌లతో, కాళ్లకు హైహీల్స్ వేసుకున్న ఆ అమ్మాయి- చేతిలో సూట్‌కేస్, భుజాన బ్యాగ్‌లతో అసహనంగా ఉంది.

'చక్కని చుక్క!' మదిలో ఊహ- మెరుపులా మెరిసి మాయమైంది.

"ఇదే..!" సమాధానమిచ్చి తన పనిలో నిమగ్నమైపోయాడు.

సూట్‌కేస్, బ్యాగ్ పక్కన పెట్టి, కర్చీఫ్‌తో ముఖం మీది చెమటలు తుడుచుకుంటూ-

"మీరు కూడా ఎమ్.బి.ఎ. ఫస్ట్ ఇయర్ రాస్తున్నారా?"

ఒకింత ఆశ్చర్యంతో- కరెక్టుగా ఎలా చెప్పగల్గిందో అర్థంగాక, ఆమె ముఖంలోకి చూశాడు.

"అదే! మీ ప్రిన్సిపుల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బుక్ చూసి..." చిన్నగా నవ్వింది.

ఆ నవ్వు గోకుల్‌కి ఎంతో రంజుగా అన్పించింది. తనూ చిన్నగా నవ్వాడు.

"ఐ యామ్ సృజన... కమింగ్ ఫ్రమ్ నర్సాపూర్!"

"హాయ్‌ః! ఐ యామ్ గోకుల్... ఫ్రమ్ విజయవాడ! బాగా ప్రిపేర్ అయ్యారా?" అన్నాడతను.

"లేదండీ! నైట్‌జర్నీ చాల టీడియస్ అయిపోయింది. నర్సాపూర్ టు సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ టూ అవర్స్ లేటు!"

పరీక్షగా చూశాడు ఆమెను. అందమైన ఫిగరు. ఎంతోమంది ఆడవాళ్ళు అక్కడ కన్పిస్తున్నారు. వారందరిలో సృజన ఎట్రాక్టివ్‌గా కనబడుతోంది.

సగటు మగవాడి హృదయంలా గోకుల్ మనసు కూడా మారాం చేయడం మొదలుపెట్టింది.

"హైదరాబాద్‌కి కొత్తా..?"

"అవును... ఇదే ఫస్ట్ టైమ్! దగ్గరలో స్టే చేయడానికి హోటల్స్ ఏమున్నాయి?" అడిగిందామె.

"నాదీ మీ టైపేలెండి! కాకపోతే- గతంలో ఒకటి రెండుసార్లు వచ్చివుంటాను!" అతను ఏదో మాట్లాడుతున్నాడు గాని, ఆమె దృష్టి అంతా టెక్స్టుబుక్ మీదే ఉంది.

● ● ●

"చాలా థాంక్స్! తెలియని క్వశ్చన్‌కి క్లూ ఇవ్వడంతో నాకు పది మార్కులు సేవ్ అయ్యాయి!" ఎగ్జామ్ రాసి బయటకు వస్తున్న గోకుల్ అనేసరికి-

"ఫరవాలేదు! మీ పరిచయంతో మెంటల్‌గా నేను స్టెబిలైజ్ కాగలిగాను. లేకుంటే హైదరాబాద్ క్వయిట్ న్యూ ప్లేస్ ఫర్ మీ! నాకసలే ఎగ్జామినేషన్ ఫియర్ జాస్తి!"

ఆటోని పిలిచిన గోకుల్- "నేను లక్డీకాపూల్ లోని ద్వారకా హోటల్‌లో ఉంటున్నాను. మీ పొజిషన్ ఏమిటి?"

"నేనూ మీతో వస్తాను!" అందామె.

ఆటోలో సృజన పక్కన కూర్చున్న గోకుల్ హృదయం ఆనందంతో అలరారుతోంది. మరునాటి ఎగ్జామ్ గురించి మాట్లాడుతున్న ఆమె మాటలు అతనికి ఏమీ వినిపించడం లేదు.

'ఎంత అందంగా ఉందీ పిల్ల?! మతిపోగొట్టే సౌందర్యం! అసలు ఇంత అందం ఏం చేసుకుంటుందో!? ఏం డ్రెస్సు అది... తెగ రెచ్చగొడుతోంది!'

ఆటోలో కన్నెపిల్ల మీదుగా వచ్చి తాకుతూన్న హుస్సేన్‌సాగర్ పిల్లగాలులు అతనిలోని కసిని మరింతగా పెంచుతున్నాయి. ఆ స్టన్నింగ్ బ్యూటీని చూసిన తరువాత, మరి దేనిమీదకీ మనసు పోవడం లేదు.

రిసెప్షన్ కౌంటర్‌లో "షి ఈజ్ మై వైఫ్ సృజన! నా రూమ్‌లో ఉంటుంది. యాడ్ హర్ నేమ్ ఆల్సో!" గోకుల్ అనేసరికి సృజన అవాక్కయింది. అరికాలి మంట నెత్తికెక్కిందామెకి..

'ఏమిటితని చనువు? చూస్తూంటే చదువుకున్నవాళ్ళలో జులాయిలా కనబడుతున్నాడు!' ఆవేశం పెల్లుబికింది. వాళ్ళందరి ముందు అతనితో గొడవ పడడం ఇష్టంలేక, నిశ్శబ్దంగా గోకుల్‌ని ఫాలో అయింది.

"సారీ సృజనా! ఎందుకో మిమ్మల్ని ఏడిపించాలనిపించి ఆ క్షణంలో 'నా వైఫ్' అని అబద్ధం చెప్పాను. మీ గురించి నా అబ్జర్వేషన్ ఏమిటో చెప్పనా?! మీ మాటతీరు తియ్యన- మనసు తీరు మెల్లన! తర్వాత పేపర్ ప్రిపరేషన్‌కి ఒకచోట ఉంటే కన్వీనియెంట్‌గా ఉంటుందని నా రూమ్‌కి మిమ్మల్ని తీసుకొచ్చాను. సున్నితంగా ఆలోచిస్తే ఒక రూమ్‌లో ఆడామగా ఉంటే- మనిద్దరి గురించీ ఇక్కడివాళ్ళు మరోవిధంగా ఊహించుకోవచ్చు. అది నాకు ఇష్టం లేదు. ఈ చిన్నఅబద్ధం చెబితే- ఆ ఊహలకు తావుండదని నా అభిప్రాయం. ఇష్టం లేకుంటే మరో రూమ్‌కి షిఫ్టు అయిపోవచ్చు. ఛాయిస్ ఈజ్ యువర్స్!"

సృజనకి ఆ మాటలు ఎందుకో నచ్చాయి. అయినా ముంచుకొస్తున్న దుఃఖాన్ని పైకి ప్రదర్శించడానికి అహం అడ్డువచ్చి లోలోపల దిగమింగుకుంది.

"సృజీ! నీ మనసులో నిలిచిన చిరుఊహల ఆనందపు కెరటాలు- నాలో ముసిముసి నవ్వుల తెరల తెరల ఉల్లాసానికి సాక్షీభూతంగా నిలుస్తాయి!"

"................."

"ఎదురుగా ఉన్న నీ అధరాలు అందుకునేంత మధురంగా ఉన్నాయి!" చిన్న ఫ్లయింగ్‌కిస్ చిలిపిగా ఇచ్చి స్నానానికి బాత్రూంలోకి దూరాడు గోకుల్.

ఒళ్ళు జలదరించింది సృజనకి. 'రూమ్ వెకేట్ చేస్తే..? చూద్దాంలే! ఇంకా ఎక్స్‌ట్రాలు పోతే అప్పుడు చూడవచ్చు' అని సర్దుకుంది.

స్నానం చేసి బైటకొచ్చిన గోకుల్- బుద్ధిగా ముఖానికి ఒకింత కుంకుమ ధరించి, చాలాసేపు ధ్యానంలో కూర్చుండిపోయాడు.

తరువాత ఎగ్జామ్ ప్రిపరేషన్‌లో మునిగిపోవడంతో- ఇద్దరి మధ్య ఎకడమిక్ డిస్కషన్ తప్ప మరోమాట చోటుచేసుకోలేదు.

చివరకి- గోకుల్ అల్లరి ఆమెకు అలవాటయిపోయింది. తనకు అన్నివిధాల సహాయ పడుతూండటంతో సృజనకి ఆ పిల్లచేష్టలు రొటీన్ అయిపోయాయి.

రూమ్‌కి బేరర్‌ని పిలిచి "మా ఆవిడ కాఫీ, టీలు తీసుకోదు. హార్లిక్స్ తీసుకురా!" అని, ధోబీ వస్తే "అమ్మగారు బాత్రూంలో ఉన్నారు. వాష్ చేయవలసిన నా బట్టలు ఆమె సూట్‌కేస్‌లో ఉండిపోయాయి. పది నిమిషాలు ఆగిరా!" అని ఏడిపిస్తాడు.

డిన్నర్‌లో వెరైటీస్ ఏమి కావాలని వస్తే "నా వైఫ్‌ని అడిగి తెలుసుకో!" అంటాడు.

ప్రతిసారీ మనసులో ఉడుక్కోవడం తప్ప- అతన్ని వారించలేకపోయింది. ఏడిపిస్తాడు... అంతలోనే 'సారీ' అంటాడు. 'మా బుజ్జికన్నా!' అంటూ ఓదారుస్తాడు. '... అమ్మడూ!' అని నవ్విస్తాడు. చనువుగా 'సృజీ!' అని పిలుస్తాడు.

అతను ఏమన్నా- పైకి ఏమీ అనలేక, ఒక నవ్వుతో సమాధానం ఇస్తుంది.

పరీక్షలు పూర్తయిన తర్వాత సృజన పంజరం నుండి విముక్తి పొందిన కపోతంలా ఎగిరిపోయింది.

అయితే ఎమ్.బి.ఎ.కి సంబంధించి సబ్జెక్ట్స్ చక్కగా డిస్కస్ చేసుకోవడంతో ఇద్దరికీ ఎంతో మేలు చేకూరింది.

తరువాత విజయవాడ నుండి నర్సాపూర్‌కు రెండు-మూడు లెటర్స్ రాశాడు. కానీ, ఆమె నుండి సమాధానం లేదు. సెకండ్ ఇయర్ కాంటాక్ట్ ప్రోగ్రాంకి వచ్చినప్పుడు మరల అదే ద్వారకా హోటల్... రిజిస్టర్‌లో గోకుల్-సృజన, వైఫ్ అండ్ హజ్బెండ్ అని నమోదు చేయించాడు. చివరికి చదువు ఇచ్చిన తెగింపుతో 'ఇంతేకదా! ఏం చేస్తాడులే..!' అని మిన్నకుండిపోయింది.

"సృజీ! నీ మనసు చాలా మంచిది. నీ అందం అపురూపం. ఆ అందాన్ని కసిదీరా అనుభవించాలనిపిస్తోంది!"

ఆమె మనసు రుసరుసలాడిపోయింది. బెంగాల్ కాటన్ శారీలో ఉన్న ఆమె శరీరాన్ని అతని చూపులు తాకుతున్నాయి.

"స్టన్నింగ్ బ్యూటీ... పర్‌ఫెక్ట్ ఫిగర్!" అంటూ అందాన్ని కళ్ళతో ఆస్వాదించసాగాడు.

గుబులుతో దుప్పటిమాటున అందాల్ని దాచేసుకొని తన మంచంమీద గువ్వలా, ఓ మూలగా ఒదిగిపోయింది. పది నిమిషాల తరువాత నెమ్మదిగా చూస్తే- నుదుట తిలకం ధరించి, బుద్ధిగా భగవత్ ధ్యానంలో అతను మునిగిపోవడం ఆశ్చర్యం గొలిపింది.

మొదట్లో అది నటన అనుకొని కొట్టిపారేసింది. తరువాత అతని మేనరిజమ్స్ చిన్నగా అర్థమవసాగాయి సృజనకి.

• • •

కదిలే కాలంతో పాటు- దాగుడుమూతలతో వాళ్ళిద్దరి చదువులు కూడా ముందుకు సాగిపోయాయి.

ఫైనలియర్ పరీక్షల చివరిరోజు..!

"సృజీ! నేనింతవరకు మాట్లాడిన మాటల్లో భాషాదోషం ఉందేమోగానీ, మనసులో భావదోషం లేదని గ్రహిస్తావు కదూ?"

వెళ్లడానికి తయారై సూట్‌కేస్ సర్దుకుంటూ, మాట్లాడుతున్న గోకుల్‌ని తీక్షణంగా చూస్తోంది సృజన.

"చక్కనిచుక్క లాంటి ఈ స్టన్నింగ్ బ్యూటీని మొదట్లో ఏడిపించాలనిపించేది. కానీ, నీ ముఖంలోని వేదన మాటున నిస్సారమైన నవ్వు నన్ను వెక్కిరించేది. ఏమైనా మనం మంచి ఫ్రెండ్స్‌గా మిగిలిపోదాం. ఆల్ ద బెస్ట్!" అన్నాడు గోకుల్.

"మనిషి కంటి కగుపించని కణరూపాన్నుంచి ఇంతటి స్థూలరూపాన్ని పొందుతాడు. ఈ రెండు రూపాల మధ్య ఆ కణం మార్పులు చేర్పులు పొందుతుంది. అలాగే పరిచయాలు అనేవి కూడా! ముందు మాటల వరకు పరిమితం. పిదప ఆత్మీయతకు, అటుపిదప అనుభూతుల వరకు తీసుకెళ్తాయి!"

అతని మాటలు విని నవ్వింది.

చెక్ అవుట్ కోసం వచ్చిన రూంబోయ్‌తో చనువుగా- "నా హబ్బీకి ఇష్టం... టూ బాగంమిల్క్ ప్లీజ్!" చెప్పింది సృజన.

గోకుల్ ఆమెవైపు వింతగా చూశాడు

దభాలున తలుపు వేసి, చటుక్కున తన పెదాలపై గాఢంగా ఆమె చుంబించడంతో అతని బుర్ర తిరిగిపోయింది.

"గోకుల్! మధురమయిన ఈ అనుభూతి జీవితాంతం నీ నుండి ఆశిస్తున్నాను. ఐ వాంట్ టు బికమ్ యువర్ లైఫ్ పార్టనర్!" అంది సృజన.

"ఏమిటీ నువ్వంటున్నది..?" చిన్నగా అరిచాడు.

• • •

"గోకీ! ఈ రైలుప్రయాణంలా నా జీవనయానాన్ని నీతో కలిసి చెయ్యాలనుకుంటున్నాను!" పట్టాలపై పరుగెత్తుతూన్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో గోకుల్‌తో అనేసరికి సమాధానం చెప్పకుండా తల తిప్పుకున్నాడు.

"నిన్ను నేను కోరుకోవడం వెనుక ఆంతర్యం తెలుసా? మూడు సంవత్సరాలు ఒకేరూమ్‌లో భార్యాభర్తలంటూ దొంగాట ఆడినా, ఏనాడూ నా జోలికి రాని నీ మనోనిబ్బరం, వ్యక్తిత్వం నన్ను బాగా ఆకర్షించాయి.

రోజూ ఉదయం, సాయంత్రం స్నానం చేసి, శుద్ధిగా బట్టలు ధరించి, నిష్ఠగా బొట్టుపెట్టుకుని కళ్ళు మూసుకొని ప్రశాంతంగా భగవంతుణ్ణి తలుచుకొనే నిన్ను చూస్తే ముచ్చటేసింది. చూడటానికి నీ ప్రవర్తన అల్లరిగా ఉన్నా నీ మనస్సు పవిత్రమైనదని నాకర్థమైంది.

అసలు స్త్రీ తన కోర్కెల్ని ఎలా వెలిబుచ్చుతుంది? బలమైన తనలోని ప్రేమను ఏ భాషలో వ్యక్తం చేస్తుంది? ఆమె మానసిక స్రవంతిలో తన ఫీలింగ్స్‌ని ఎగ్జిబిట్ చేయడానికి భాష ఏమీ ఉండదా? వాళ్ళకే బలమైన వాంఛలుంటాయి. కానీ, మగాళ్ళలా వారి కోర్కెలకి భాష లేదు.

గోకుల్! నీపై నేను పెంచుకున్న ప్రేమను ఒక సింబాలిజమ్ ద్వారా ఎక్స్‌ప్రెస్ చేయనా?

కోరిన కోమలి తన నెలరాజుపై, వలపు సుగంధాలు వెదజల్లి తన ఎద సింహాసనంపై పట్టాభిషిక్తుణ్ణి చేస్తుంది. అత్తరుల వాసనలు, అగరువత్తుల పరిమళాల మధ్య వెన్నెల రాణి, సిగ్గుదొంతరలతో నెలరాజు మధుర స్వప్నంలా నిలబడేసరికి తొలివలపు కవ్విస్తుంది. తనువు పొందు కోసం ఎంతగానో తపిస్తుంది.

అపుడు మనసు మల్లియలై విరబూస్తూంటే, పరువం మరువపు దండలా గుబాళిస్తుంది. తను ఇంతకాలం గుంభనంగా దాచుకున్న వలపు శిఖరాలను తనవాడు ఆక్రమిస్తే అవి మరింతగా ఉప్పొంగి వలపు సాగరంలో ముంచుతాయి. ఆ సంగ్రామంలో ప్రియునిదే పైచేయి అయి ఆమెను పూర్తిగా ఆక్రమించుకుంటుంటే, అష్టావధానం చేస్తూన్న అతన్ని అన్నిదిక్కుల నుండి ప్రోత్సహించిన స్త్రీత్వంతో ఆమె తనువు తరిస్తుంది.

గోకుల్! నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా...

లవ్ టు ద పవరాఫ్ ఇన్ఫినిటివ్ అంత!"

పెద్ద శబ్దంతో రైలు పరుగులు పెడుతున్నా- ఒక్కసారి వారిద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది.

చల్లని పిల్లగాలి తెమ్మెర అలాఅలా పలకరిస్తూండగా రైలుప్రయాణంలో కిటికీ పక్కన చీకట్లో ఎక్కడో మినుకుమినుకుమంటున్న దీపాలు, ప్రశాంతమైన ఆమె మనస్సులో అతనితోటి అనుభవాల్ని కదిలించి ప్రపంచానికి దూరం చేస్తున్నాయి.

పక్క బెర్తులలోని కొత్తగా పెళ్ళయిన పడుచు జంట- "పూరీ...పూరీ..." అంటూ అటుగా వచ్చిన వెండర్ నుండి ప్లేటు పూరీ తీసుకుని, చెరొకటి పంచుకుని తింటున్నారు.

సృజన కోరిక మేరకు తాను కూడా అలా చేయక తప్పలేదు గోకుల్‌కి. "ఇడ్లీ... ఇడ్లీ..." అంటూ అమ్మకానికొచ్చిన బేరర్ నుండి ఇడ్లీ తీసుకొని చెరొకటి షేర్ చేసుకున్నారు. రెండు కట్లెట్స్- చెరొకటి, ఒక దోసె- చెరిసగం..!

ఈ సగం-సగం ఫార్ములాతో గోకుల్ పెదాలు విచ్చుకుంటున్నాయి.

"గోకీ! తమకిష్టమైన ప్రతిదాన్నీ చెరిసగం పంచుకు తింటూన్న ఆ పడుచు జంటను చూడు... జీవితం అంటే అదే! తన కిష్టమైన వస్తువుల్ని, ఇష్టమైన జీవితాన్ని, అనుభూతుల్ని, చివరికి శారీరక సుఖాల్ని తన కిష్టమైనవారితో పంచుకోవాలనుకోవడం..! అప్పుడే ప్రేమ పరిపక్వ మవుతుంది. అదే నీనుండి నేను కోరుకునేది!"

విజయవాడ స్టేషన్‌లో ట్రైన్ బయలుదేరబోతోందని అనౌన్స్‌మెంట్ వినిపిస్తోంది.

ఒక్కసారి మనసు వాంఛించే సమాగమ భావసమ్మేళనం మిశ్రితమై ఇద్దరిలో మౌనం కమ్మింది. అందమైన ఆమె అధరాలు తనని అందుకోమంటున్నాయి. అంతకుముందెన్నడూ ద్యోతకం కాని అనురాగం వర్షిస్తున్నది- అతడి నేత్రాలలో! స్నిగ్ధ చిరుదరహాసం తాండవమాడుతున్న ఆ అధరాలు అతని అందాన్ని ద్విగుణీకృతం కావించాయి.

ఆ ముఖంలో భాష కందని భావాలెన్నో పరుగులిడాయి. అంతలో విషాద మేఘాచ్ఛాదితమై కనురెప్పలు బరువుగా వాలిపోయాయి.

సూట్‌కేస్‌తో ప్లాట్‌ఫారం దిగిన గోకుల్- "సృజీ! మొదట్లో అల్లరిగా బిహేవ్ చేసిన నేను- ఎప్పటికప్పుడు నువ్వు నా చెంప పగలగొడ్తావని భావించేవాణ్ణి! చూడ్డానికి కోపంతో నిప్పులు చెరిగే నీలో ఇంత మమకారం దాగుందని గ్రహించేసరికి నా హృదయం ఫ్రీజ్ అయిపోయింది. మెదడు మొద్దుబారిపోయింది. రియల్లీ యు ఆర్ గ్రేట్!

ఆనాడు నీవలా గుంభనంగా ఉండకబోతే నేను తప్పుచేసి ఉండేవాడినేమో? తలచుకుంటే నా మీద నాకే అసహ్యం కలుగుతోంది. ఈ వేదనతో ఫీల్ అవుతున్న నన్ను- నీ తీయని పలుకులతో సేదదీర్చావు.

నీ రూప లావణ్యానికి నీ మానసిక సౌందర్యం ఓ గుబాళింపు! నీ వ్యక్తిత్వానికి హేట్సాఫ్! ఇందాక నువ్వన్నావు గుర్తుందా... నాతో కలిసి ప్రయాణించాలని... ఐ టూ లైక్ ఇట్! నీతో జీవితాంతం కలిసి నడవాలనుంది!"

ఆనందంగా ఆమె చేయిని చుంబించాడు.